'ఆంధ్రభూమి' దినపత్రిక - 3.4.1987

# రేడియో పీస్

తెల్లారింది.

రాజారావుకి పిచ్చెక్కినట్టుగా వుంది. ఏ పని సరిగ్గా చేసుకోలేకపోతున్నాడు. చిరాకు పడిపోతున్నాడు. ఆ చిరాకు పిల్లల మీదో, పెళ్ళాం మీదో చూపిస్తున్నాడు.

గత మూడు రోజులుగా ఇదే వరుస.

కలివిడిగా తిరిగే బిడ్డను కోల్పోయినట్టు... విలువైన వస్తువునేదో పోగొట్టుకున్నట్టు... కాలమే స్థంభించిపోయినట్టు.. ఇదంతా ఎందుకంటే గత మూడు రోజులుగా ఇంట్లో రేడియో మూగనోము పట్టింది. పలకడం, ఉలకడం మానేసింది.

పెళ్ళం అలిగి పలక్కపోతే కలిగే ఇబ్బంది కన్నా రేడియో మౌనం అతనికి భరింపరానిదిగా ఉంటోంది. పోయిన తల్లి కన్నా ఆగిన రేడియో రోజూ గుర్తుకొచ్చి దిగులు కలిగిస్తోంది.

ఇవి టీవీ రోజులు. అతని ఇంట్లో టీవీ కూడా ఉంది. అయినప్పటికీ రేడియో లేని దిన చర్య అతనికి దుస్సహంగా, దుర్భరంగా ఉంటోంది.

ఏ రోజుకారోజు డ్యూటీ నుంచి రాగానే రేడియో రిపేరు కివ్వాలనుకోవడం... మర్చిపోవడం లేక ఏ పని వత్తిడిలోనో పడిపోవడం జరుగుతుంది.

లాభం లేదు. ఈ రోజు కచ్చితంగా రేడియో రిపేరు కివ్వాలని బాస్ నడిగి గంట పర్మిషన్ తీసుకున్నాడు. మిత్రుడు పాపారావు సాయంతో స్కూటర్‌పై రేడియోని రిపేరు షాపుకి చేర్చాడు.

మెకానిక్ రెండు రోజుల్లో బాగుచేసి ఇస్తానన్నాడు.

రాజారావు అందుకు ఒప్పుకోలేదు. ఈ రోజే కావాలన్నాడు. బతిమాలేడు, బామాలేడు.

బాబ్బాబు రేప్పొద్దున ఊరెళ్ళిపోతున్నాం, నెల రోజుల వరకు రానని బొంకేదు. ఆ సాయంత్రం డ్యూటీ నుంచి డైరెక్టుగా వెళ్ళి, అక్కడే బైటాయించి రాత్రి తొమ్మిది గంటలకు రేడియోతో ఇంటి ముఖం పట్టేడు.

మరుసటి రోజు ఉదయం రేడియో సుప్రభాతం ఆలపిస్తుండగా... ఆహ్లాదకరంగా రాజారావు దినచర్య మొదలయింది. అతనికిప్పుడు ఏమాత్రం పిచ్చెక్కినట్టుగా లేదు. ఎవరి మీద చిరాకు లేదు, చిందులేల్లవు. వెన్నెల్లో వెండిరథం మీద వెళ్తున్నట్టుగా.. తన పనులు చకచక చేసుకుపోయేడు.

డ్యూటీకి బయల్దేరేవరకూ అలా మ్రోగుతూనే ఉంది. (రేడియోతో అతనికి ఎంతటి అవినాభావ సంబంధమంటే ఫేమిలీ ఇంట్లో లేనప్పుడు రేడియో కట్టడం మర్చిపోయి ఇంటికి తాళం వేసుకు వెళిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి).

సరిగ్గా ఎనిమిది గంటలకు ఠంచనుగా ఆఫీసుకి చేరుకొన్నాడు.

ఆఫీసులోకి రాగానే పాపారావు అడిగిన ప్రశ్న – "ఒరే! ఈ రోజు రేడియో న్యూస్ విన్నావా? తిరుచ్చిలో ట్రైను ఆక్సిడెంటు అయిందట. ఏమిటి వివరాలు?"

"ఆహా! అలాగా నాకు తెలీదే!" అన్నాడు ఆశ్చర్యపోతూ రాజారావు.

"బాగుంది. ఏం! రేడియో పనిచేయడం లేదా? న్యూస్ వేళకి లేవలేదా?

"రేడియో ఆరు గంటలకే ఆన్ చేశాను. బాగానే పనిచేస్తోందే!"

"మరేం? ఎంచేత వినలేదు?"

"ఒరేయ్! ఎప్పుడూ అలాంటి తెలివి తక్కువ ప్రశ్న వేయకు. రేడియో పెట్టడం పెడతాగాని... నేనెప్పుడూ కావాలని ఏదీ వినను. ఏదైన పొరపాటున చెవిలో పడితే తప్పా!"

పాపారావు ఆశ్చర్యపోయేడు.

"ఈ మాత్రానికేనా రేడియో రిపేరు అయేదాకా అంత వర్రీ అయిపోయేవు"

పకపకమన్నాడు రాజారావు.

"రేడియో కార్యక్రమాలకు వాచిపోయి నేను రేడియో బాగుచేయలేదురా బ్రదర్! నాకు రేడియో అలారం! నా కాలకృత్యాల్లో ఎప్పటికప్పుడు తట్టిలేపే యంత్రం."

"అంటే"

"భక్తిరంజనితో పేపరు చదవడం మొదలెట్టి సూక్తి ముక్తావళితో ముగిస్తాను. తర్వాత లెట్రిన్. ఏ ఆలోచనలతోనో అక్కడే కూర్చుండిపోతే పొలం పనులయిపోతున్నాయి మొర్రో అని మా ఆవిడ అరుస్తుంది. సంస్కృత వార్తల్లో దంతధావనం. ఆకాశవాణి వార్తల్లో గెడ్డం గీకుడు సమాప్తం. సంగీత లేక సంస్కృత శిక్షణలో పూజ! తర్వాత టిఫిన్. పుష్పాంజలి పారాహుషార్ అంటుంది. ఒకొక్క పాట ఒక కమ్చీ దెబ్బ! పుష్పాంజలి ముగియకముందే నేను స్కూటర్ తీయకపోతే డ్యూటీకి పంచింగ్ కార్డు మిస్... జీతం కట్... బాస్‌తో దొబ్బులు... అదిరా బ్రదర్ – అట్టి ఆపదల నుంచి కాపాడే నా ప్రియమిత్రుడు రేడియో!" ❁